క్లుప్తంగా

పిచ్చికుక్క స్వైరవిహారం

మామిడికుదురు: పెదపట్నం గ్రామంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ఇద్దరు పిల్లలతో పాటు మరో ఇద్దరు కుక్కకాటుకు గురయ్యారు. ఏడేళ్ల కొమ్ముల దత్తగోపాల్, పదేళ్ల యర్రంశెట్టి దుర్గ, 28 ఏళ్ల యర్రంశెట్టి హేమ, పదేళ్ల షేక్ అబేద్ కుక్కకాటు బారిన పడి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పిచ్చికుక్కను స్థానికులు కర్రలతో కొట్టి చంపారు. మండలంలోని ప్రతి గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద నుంచి విముక్తి కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

94 శాతం కులగణన పూర్తి

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో 94 శాతం కులగణన పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. మంగళవారం మండలంలోని నేదునూరు, అయినవిల్లి, విలస తదితర గ్రామాల్లో కులగణన జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు నేడు ప్రారంభోత్సవం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.మూడు కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు బుధవారం ప్రారంభోత్సవం జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మూలస్థాన అగ్రహారం, పినపళ్ల, మడికి, పెనికేరు, జొన్నాడ గ్రామాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పర్యటించనున్నారన్నారు. ఆయా గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం త్యాగరాజ స్వామి, శ్రీరామ చంద్రమూర్తిలను మంగళ వాయిద్యాలతో, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు ఆలపిస్తూ గ్రామంలో ఊరేగించారు. అనంతరం త్యాగరాజ శ్రీరామ చంద్రమూర్తులకు సహస్రనామ పూజలు జరిగాయి. ఈసందర్భంగా పిన్నింటి అన్నపూర్ణ తదితర గాయనీమణులతో త్యాగరాజ పంచరత్న కీర్తన సేవ జరిగింది. మధ్యాహ్నం ఔత్సాహిక గాయనీమణులు, సంగీత విద్యార్థులతో సంగీత నివేదన జరిగింది. రాత్రి హైదరాబాద్‌కు చెందిన జేఎస్ శ్రీరామ్‌చే గాత్ర సంగీత సభ నిర్వహించారు. వీరికి వయోలిన్‌పై వీఎస్‌పీ గాయత్రి శివాని (చెన్నై), మృదంగంపై కమలాకర్ యోగేష్ (రాజమహేంద్రవరం) సహకారం అందించారు. కార్యక్రమాల్లో త్యాగరాజ ఆరాధనోత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతునేస్తం రుణాల పంపిణీ



చొప్పెల్లలో రైతులకు రుణాలను అందజేస్తున్న డీసీసీబీ అధికారులు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల పీఏసీఎస్ పరిధిలో రైతునేస్తం పథకం కింద రూ.12 లక్షల రుణాల పంపిణీ జరిగింది, స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ వీరా రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలమూరు డీసీసీబీ బ్రాంచి చైర్మన్ ఐఎస్‌డీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సొసైటీకి చెందిన పది మంది రైతులకు ఈ రుణాలను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రాజు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. పంటలను బట్టి ఎకరానికి రూ.8 లక్షల వరకూ రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. అర్హులైన రైతులందరికీ రాయితీపై ఎరువులను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ వక్కలంక గ్రామశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి పెదబాబు పుట్టినరోజు సందర్భంగా యూత్ సభ్యులు సమకూర్చిన దుప్పట్లను మంగళవారం ఆయన చేతుల మీదుగా గ్రామంలోని వృద్ధులకు పంపిణీ చేశారు. జేసీఎస్ మండల అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, నాయకులు ముత్తాబత్తుల ప్రశాంత్ కుమార్, బండారు మల్లి, పితాని శెట్టి, మట్టపర్తి హరి, చింతపల్లి వెంకటేశ్వరరావు, వక్కలంక గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు 8 గ్రామాలకు విద్యుత్ అంతరాయం

మామిడికుదురు: మగటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎనిమిది గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఓఎన్జీసీకి సంబంధించిన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మగటపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గోగన్నమఠం, మగటపల్లి, ఈదరాడ, కొమరాడ, ఆదుర్రు, లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాలతో పాటు రాజోలు మండలంలోని పొన్నమండ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గాంధేయ మార్గం అందరికీ ఆదర్శం

- ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- కొత్తపేటలో జాతిపితకు ఘన నివాళి



కొత్తపేటలో మహాత్మునికి నివాళులర్పిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: మహాత్మాగాంధీ అనుసరించిన అహింసా మార్గాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవడం ద్వారా శాంతియుత సమాజం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం పంచాయతీ వద్ద పార్కులో మహాత్ముని విగ్రహానికి ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీటీసీలు పేపకాయల బ్రహ్మానందం, నేలపూడి భీమరాజు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, మండల మహిళా విభాగం కన్వీనర్ పోతుల చంద్రావతి, మసీదు, షాదీఖానా అధ్యక్షుడు షేక్ కాజాబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజీ విగ్రహానికి ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపం, సమితి రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్, పంచాయతీ పార్కుల్లో గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. పలివెలలో మహాత్మాగాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక విద్యాబాలమందిర్‌లో మహాత్ముని చిత్రపటానికి కరస్పాండెంట్ ఆర్.అనురాధ, హెచ్‌ఎం ఎస్.శివరత్నం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజోలులో..

రాజోలు: స్థానిక గాంధీ సెంటర్లో గాంధీ విగ్రహం వద్ద, స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాలు రాజోలు ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘ ప్రెసిడెంట్ కాసు శ్రీనివాస్, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కాసు శ్రీనివాస రంగనాయకమూర్తి, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ గెల్లి అన్నపూర్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి



సంధిపూడిలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

గాంధీ సేవలు చిరస్మరణీయం: విప్పర్తి

పి.గన్నవరం: మహాత్మాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాటోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెంటపాటి శ్రీనివాస్, సంఘ నాయకులు పాటోలు సత్యనారాయణ, శ్రీఘాకోళపు లక్ష్మీపతి, సలాది చలమయ్య, కట్టా చిన్ని, శ్రీఘాకోళపు నాగేశ్వరరావు, కూరపాటి నాగేశ్వరరావు, శిరం నాగబాబు, వంకాయల బ్రహ్మానందం, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు. పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక వాసవీ ఆర్యవైశ్య సంఘ భవనంలో సంఘ సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా, వాసవీ మహాత్మాగాంధీ సేవా సమితిని నూతనంగా ప్రారంభించారు. సేవా సమితికి గౌరవ అధ్యక్షుడిగా మన్యం పర్వత వర్ధనరావు, అధ్యక్షుడిగా మోటమర్రి సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా కంకటాల హరినాథ్, కోశాధికారిగా కడించర్ల నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గాంధీ వర్ధంతి సందర్భంగా పుల్లేటికుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం, గాంధీ సెంటర్ వద్ద గాంధీజీ విగ్రహాలకు సర్పంచ్ జల్లి బాలరాజు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరా రవి, వార్డు మెంబర్ ఆకెళ్ల సూరిబాబు, మాజీ సర్పంచ్‌లు నూకపెయ్యి చిన్నా, అందె వెంకట ముక్తేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి పురస్కరించుకుని మామిడికుదురులోని విగ్రహానికి కాంగ్రెస్ నేతలు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గాంధీ వర్ధంతి మంగళవారం జరిగింది. ఆలమూరులోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో అధికారులు, సిబ్బంది గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్రోద్యమానికి గాంధీజీ పోరాడిన తీరు, దేశానికి చేసిన సేవలను పలువురు వక్తలు గుర్తుకు తెచ్చుకున్నారు. మండలంలోని సంధిపూడి, గుమ్మిలేరు చెముడులంక, చొప్పెల్ల, పెదపళ్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో వేంచేసియున్న గాంధీ విగ్రహాల వద్ద స్థానికులు, అభిమానులు గాంధీ వర్ధంతి పురస్కరించుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘాలు, అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పలు గ్రామాల్లో గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- రూ.2.11 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం



రావులపాలెంలో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని గ్రామాలను అభివృద్ధి చేయడమే దీనికి నిదర్శనమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం రావులపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ప్రారంభించారు. రూ.2.11 కోట్లతోతో నిర్మించిన గ్రామ సచివాలయం-1 భవనం, గ్రామ సచివాలయం-1 ఆర్బీకే, గ్రామ సచివాలయం-3 ఆర్బీకే, గ్రామ సచివాలయం-5, గ్రామ సచివాలయం-5 రైతు ఆర్బీకేలను ప్రారంభించారు. అలాగే పోతంశెట్టి రామిరెడ్డి పార్కులో అభివృద్ధి పనులు, ఊబలంక రోడ్డు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సాయిబాబా గుడి జంక్షన్ వరకు నిర్మాణం చేసిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాలువ అవతల వాటర్ ట్యాంకు వద్ద నిర్మాణం చేసిన వాచ్‌మన్ బిల్డింగ్, వాటర్ ట్యాంకు మెట్లు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, వార్డు సభ్యులు, సెక్రటరీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరులో ఎస్ఈబీ, పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. ఇద్దరి వ్యక్తులను కొత్తపేట కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యం



పాశర్లపూడిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే కొండేటి

మామిడికుదురు: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం గ్రామ సచివాలయాల ద్వారా సాకారమైందని జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్థాయిలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికారని గుర్తు చేశారు. అన్ని సేవలను ప్రజల ముంగిటకు తీసుకు వచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ నిర్మాణానికి లక్షలు విలువైన స్థలాన్ని ఇచ్చిన దాత, వైఎస్సార్ సీపీ నేత గంధం గోపాల్‌ను అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కళిరెడ్డి అంజిబాబు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఎండీని కలసిన ఎమ్మెల్యే రాపాక



విశాఖపట్నంలో విద్యుత్ శాఖ ఎండీ తేజని కలసిన ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: విశాఖపట్నంలో మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) పృథ్వీతేజని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కేటాయించాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని ఎమ్మెల్యే ఆయనకు అందజేశారు.

జగన్ హయాంలో ప్రజలకు చేరువైన పాలన

కొత్తపేట: సీఎం జగన్ హయాంలో ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువైందని ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.3.71 కోట్లతో నిర్మించిన నూతన భవనాలు ప్రారంభోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉదయం కొత్తపేట-1, 2 సచివాలయాల పరిధిలో రూ.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాల భవనాలు, అదే గ్రామంలోని 1,3,4,5 సచివాలయాల పరిధిలో రూ.87.20 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలు, 3,4,5 సచివాలయాల పరిధిలో రూ.52.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. సాయంత్రం మందపల్లి, మోడేకుర్రు, వాడపాలెం గ్రామాల్లో రూ 1.20 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనాలు, అవిడి, మోడేకుర్రు గ్రామాల్లో రూ.35 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు, కొత్తపేటలో ముస్లిం కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఏఎంసీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాదు వెంకటలక్ష్మి, కుడుపూడి రామలక్ష్మి, ఎంపీటీసీలు పేపకాయల బ్రహ్మానందం, దూళి సూరిబాబు, నేలపూడి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



అవిడిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అంతర్వేదిలో ఆర్డీవో పర్యటన

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానంలో వచ్చే నెల 16 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించనున్న స్వామివారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై మంగళవారం క్షేత్రస్థాయిలో అమలాపురం ఆర్డీవో కేశవవర్ధన్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. ఈ మేరకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన పనుల పరిస్థితులను అధికారులతో సమీక్షించారు. కల్యాణ మండపం డెకరేషన్, రథం సిద్ధం చేసే పనులు, పౌర్ణమి స్నానాల ఏర్పాట్లు, తెప్పోత్సవం, ఎలక్ట్రికల్ వర్క్స్, క్యూ లైన్లు, పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి వాటిపై కింది స్థాయి అధికారులతో చర్చించారు. ఈ మేరకు ఏర్పాట్లుపై పలు సూచనలు ఆర్డీవో వారికి చేశారు. వెంట ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, రాజోలు సీఐ గోవిందరాజు, తహసీల్దార్ వై.రామకుమారి, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంతర్వేదిలో చెరువు వద్ద తెప్పోత్సవం గురించి అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో కేశవవర్ధన్ రెడ్డి

సంక్షిప్తంగా..

జాతీయ స్థాయి తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

అంబాజీపేట: రాజస్థాన్‌లో ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన మహిళ విభాగం తైక్వాండో పోటీల్లో అంబాజీపేట మండలానికి చెందిన కుసుమ వైష్ణవి, బొక్కా హేమలత సౌమ్య, పితాని భార్గవి శ్రీకళ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కై వశం చేసుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ పితాని త్రిమూర్తులును, విద్యార్థులను, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్ మంగళవారం అభినందించారు. వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఘనంగా అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం స్వామి వారి అష్టోత్తర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలు నిర్వహించా రు. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మామిడికుదురు: నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 23 మంది పదో తరగతి విద్యార్థులకు రాజోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్ అందించారు. రొటేరియన్ మహ్మద్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో వీటిని విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏడిద కవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిట్టినీడి లక్ష్మణరావు, దార్ల పెదబాబు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల శాలివాహన సంఘ అధ్యక్షుడిగా మల్లవరపు

ఆలమూరు: మండల శాలివాహన (కుమ్మరి) అధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన మల్లవరపు మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జనార్దన స్వామి ఆలయ ఆవరణలో బుధవారం మండల శాలివాహన సంఘ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సంఘ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి.త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా పుల్లేటికుర్తి సుబ్రహ్మణ్యం, పి.రాజు, ప్రధాన కార్యదర్శిగా పసలపూడి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా పాండ్రాకుల సత్తిబాబు, పాండ్రాకుల కాశీ కృష్ణ, అలాగే కోశాధికారిగా పాలకొల్లు పట్టాభిరామయ్య, సమన్వయకర్తగా పాండ్రాకుల అమర్నాథ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సహచర సభ్యులు ఘనంగా సత్కరించారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

కొత్తపేట: కడుపునొప్పి తాళలేక ఒక మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోడేకుర్రు శివారు గొలకోటి వారిపాలేనికి చెందిన గొలకోటి సత్యదేవి (27) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈనెల 24న తీవ్రంగా వచ్చిన కడుపునొప్పి భరించలేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేసి, ఉన్నత వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. తల్లి చవ్వాకుల సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు ప్రారంభం

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని గ్రామ సచివాలయాల పరిధిలో కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు కుష్ఠువ్యాధి నిర్మూలన-తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. బహుళ ఔషధ చికిత్స (యండీటీ) అందుబాటులో ఉన్నందున రోగులెవరూ ఆందోళన చెందనక్కర్లేదన్నారు. ప్రజలందరూ కుష్ఠు వ్యాధిపై అవగాహన పెంచుకుని దానికనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఆరోగ్య సిబ్బంది కుష్ఠు వ్యాధి నిర్మూలన కరపత్రాలను ఆవిష్కరించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎం.రవికుమార్, హెచ్‌ఎస్ వి.విజయకుమారి అన్నారు. మండలంలోని ఇరుసుమండలో మంగళవారం జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. వీరు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వారికి చేరవేయాలని అన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎ.రాధా నారాయణ, ఎంపీహెచ్‌ఎస్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.